క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి బ్రాహ్మణ సంఘం మద్దతు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చి, ఆ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మండల బ్రాహ్మణ సంఘం తీర్మానించింది. సంఘం గౌరవాధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాస్ కుమార్, అధ్యక్షుడు ఇలపకుర్తి కామేశ్వరరావు ఈ విషయాన్ని శనివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాలను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సంఘ సభ్యులకు సూచించారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో నిత్య పూజలందుకుంటున్న ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులతో గోవింద నామాలు ఆచరింపజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


వేండ్రలో కూలీల హాజరు పరిశీలిస్తున్న ఏపీడీ వసంత మాధవి

పెదపూడి: ఉపాధి హామీ పనుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ పథకం పెద్దాపురం క్లస్టర్ ఏపీడీ వసంతమాధవి అన్నారు. మండలంలోని చింతపల్లి, వేండ్ర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కూలీలకు హాజరును, మస్తర్లను సరిపోల్చి చూశారు. ఈ సందర్భంగా వసంత మాధవి మాట్లాడుతూ ఎవరైనా బినామీ మస్తర్లు వేసినా, ప్రదేశం మార్చి పనులు చేసినా చర్యలు తప్పవిన హెచ్చరించారు.

మజ్జిగ వితరణ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ పాటి సత్యనారాయణ

మధురపూడి: కోరుకొండ రెడ్డి పంతులు సత్రంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. సత్రం ఈఓ పాటి సత్యనారాయణ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏటా మాదిరిగానే చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం


విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద కొలువైయున్న విజయ దుర్గాంబిక ఆలయ 31వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. భక్తులంతా పాల్గొని అమ్మవారిని దర్శించి, అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

పాలిసెట్‌కు 1,563 మంది హాజరు

రాజానగరం: ఏపీ పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్ శనివారం ప్రశాంతంగా జరిగింది. గోదావరి గ్లోబెల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలలో 1,563 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని ప్రిన్సిపాల్ డాక్టర్ పీజీ రామానుజన్ తెలిపారు.

అథ్లెటిక్స్ శిక్షణ ప్రారంభం

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి అథ్లెటిక్ అసోసియేషన్ సహకారంతో శనివారం స్థానిక నాగుల చెరువు బజార్‌లోని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.త్రిమూర్తులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పి.రాజు, కుమార్ బాబు, అసోసియేషన్ కార్యదర్శి ఎస్.నాగరాజు, ఎండీ.ఇబ్రహీం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- జోరుగా ఎన్నికల ప్రచారం


రఘుదేవపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రఘుదేవపురం, రాపాక, నల్గొండ గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పోటెత్తిన పార్టీ శ్రేణులు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. రఘుదేవపురం శివారు నుంచి ఎమ్మెల్యే రాజాకు ఘన స్వాగతం పలికారు. సుమారు 500 మోటారు సైకిళ్లతో ర్యాలీగా వెళ్లి రాజాకు స్వాగతం పలికారు. గ్రామాల్లో మహిళలు తరలివచ్చి ఎమ్మెల్యే రాజాపై పూలవర్షం కురిపించారు. గుమ్మడి కాయలతో దిష్టితీసి హారతులు పట్టారు. రఘుదేవపురం శివారు ముగ్గళ్ల కాలువ వద్ద ఉన్న గోదావరి మాత విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గ్రామాల్లోని పలు ఆలయాలను దర్శించారు. గ్రామాల్లో ప్రచారం సమయంలో ఎమ్మెల్యే రాజాను స్థానికులు ఆహ్వానించడంతో, ఆయన ప్రచార రథం దిగి వారందరికీ పలకరించారు.

చంద్రబాబు హయాంలో అవినీతి ఫుల్

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు సమయంలో రాష్ట్రం అవినీతిమయంగా మారిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్ నవరత్నాల పథకాలతో మరెన్నో పథకాలను అమలు చేశారన్నారు. వీటితో రాష్ట్రంలో పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. వలంటీర్లతో అవ్వాతాతలకు ఇంటి వద్దకే నేరుగా వెళ్లి పింఛన్, రేషన్ సరకులను అందజేశారన్నారు. ప్రతి పంచాయతీలోనూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. తనతో పాటు అమ్మ జక్కంపూడి విజయలక్ష్మి, తమ్ముడు జక్కంపూడి గణేష్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. ఇప్పుడు తన భార్య డాక్టర్ రాజశ్రీతో పాటు తమ్ముడు గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్‌లు ఇందుగుమిల్లి చంద్రలీల, చింతల నేహప్రియ, ఎంపీటీసీలు యలమాటి లలిత శిరీష, పంతులు వెంకట రమణ, పట్టపగల ప్రసాద్, పిచ్చుకల రవికుమార్, పిచ్చుకల విజయ్ కుమార్, గెద్దాడ త్రిమూర్తులు, పిండి రాధాకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శనివారం ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై టి. రామకృష్ణ మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లకు ఓటు వేయడానికి వచ్చిన వారికి వలంటీర్లు సహాయపడాలన్నారు. వారి సందేహాలను తీర్చి, సక్రమంగా ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల రోజున వారికి కేటాయించిన కేంద్రాలలో అంకితభావంతో సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధామయి, వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, షేక్ మదీనా, డాక్టర్ మాధవ్, వాణి, వెంకటేష్, అలేఖ్య, ఫణీంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

అండగా ఉన్న ప్రభుత్వాన్ని ఆదరిద్దాం


జి.దొంతమూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


జి.దొంతమూరులో ఎమ్మెల్యేకు మంగళ హారతులు ఇస్తున్న మహిళలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.దొంతమూరులో ఇంటింటా ఎన్నికల ప్రచారం

రంగంపేట: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జి.దొంతమూరు గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు జి.దొంతమూరు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పూలజల్లులు, మంగళ హారతులతో సాదర స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ముందుగా స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అవసరాలను గుర్తించి ఇంటి వద్దకే పరిపాలన అందించేందుకు సచివాలయ, వలంటీరు వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దకు తెచ్చి మరీ పింఛన్ అందించారన్నారు. టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ పెట్టి వృద్ధులకు పింఛన్ అందకుండా ఎన్నో ఇబ్బందులకు గురి చేశారన్నారు. పేదల కష్టాలు తీరాలంటే జగనన్న సుపరిపాలనతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. జగనన్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, చెక్కపల్లి నాగేశ్వరరావు, దుప్పలపూడి చిట్టిబాబు, ముత్యం వీరబాబు, దుప్పలపూడి ఏడుకొండలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- బలభద్రపురంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం


బలభద్రపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని బలభద్రపురంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఆమెకు ఇంటింటా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఎక్కడా వివక్షకు తావు లేకుండా అన్ని గ్రామాల్లో అభివృద్ధి చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించేందుకు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకుందామన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్త డాక్టర్ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, పెదపూడి ఎంపీపీ కేతా రామ తులసి, పెదపూడి జెడ్పీటీసీ సభ్యురాలు వేపకాయల వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ నల్లమిల్లి వెంకట రెడ్డి, ఎంపీటీసీలు మేడపాటి ఆనందరెడ్డి, వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమం

- ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ భార్య రాధిక
- ఉపాధి కూలీలతో సమావేశం


కార్యక్రమంలో పాల్గొన్న గూడూరి రాధిక, వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అందరి సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ భార్య రాధిక అన్నారు. కోరుకొండ దేవుని చెరువు పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలతో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. తన భర్త గూడూరి శ్రీనివాస్ అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. బీజేపీ అభ్యర్థి పురందేశ్వరి బాపట్లలో ఉంటారని, ప్రజలు ఆమె కలిసే అవకాశం కూడా ఉండదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వారి కోసం పనిచేసే గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంధం నారాయణరావు, రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, కోరుకొండ ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, నీరుకొండ బాబ్జీ, కాలచర్ల శ్రీను, రాజా రమాదేవి పాల్గొన్నారు.

తాటి ముంజెలు.. పుష్కలంగా పోషకాలు

- వేసవి ఎండల నుంచి ఉపశమనం
- రోడ్ల పక్కనే విక్రయాలు


తాటికాయల నుంచి ముంజెలు తీస్తున్న వ్యాపారి


తాటి ముంజెలు

రాజానగరం: తాటి ముంజెలకు వేసవి కాలంలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి ప్రకృతి ప్రసాదించిన వరం ఇవి. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో రైతుబిడ్డలకు మాత్రమే దొరికే ఈ తాటి ముంజెలు ప్రస్తుతం దారి పొడవునా లభిస్తున్నాయి. వేసవి సెలవులకు వచ్చిన స్నేహితులు, బంధువులతో కలిసి సరదాగా పొలాలకు వెళ్లిన భూస్వాముల పిల్లలు తమ పాలికాపుల ద్వారా తాటిచెట్ల నుంచి ముంజులు కోయించి ఆరగించేవారు. ఈ కాలంలో పొలాలకు వెళ్లి ముంజెలను ఆరగించేందుకు తీరిక ఎవరికీ ఉండటం లేదు. భూస్వాముల పిల్లలైనా, వారి స్నేహితులైనా పొలాల్లో అడుగు పెట్టే రోజులు పోయాయి. అక్షరాభ్యాసంతోనే పోటీతత్వాన్ని అలవర్చుకుంటున్న ఈ రోజుల్లో సామాన్యుల పిల్లలు సైతం పుస్తకాలకు అతుక్కుపోతుంటే ఇక భూస్వాముల పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. పట్టణాల్లో హాస్టళ్లలో చేర్చి మరీ చదివిస్తుంటే ఇక పొలాల గురించి, తాటి ముంజెల రుచి గురించి తెలుసుకుని ఆస్వాదించే తీరిక వారికి ఎక్కడుంటుంది. అందుకే రోడ్ల పక్కన లభిస్తున్న ఈ తాటిముంజెలపై ఆసక్తిని కనబరుస్తున్నారు.

రూ.50కి డజన్ ముంజెలు

రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ, వెంకన్నపేట నుంచి కాకినాడ వరకూ, కొవ్వూరు నుంచి ఏలూరు జంక్షన్ వరకూ రోడ్ల పక్కన ఈ తాటి ముంజెలను విక్రయిస్తున్నారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన అనేక మంది ఈ సీజన్‌లో ఇదే వృత్తిగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. డజను ముంజెలను కవర్‌లో వేసి రూ.50కు అమ్ముతున్నారు. పల్లెల్లో సైకిళ్లపై ఇంటింటికీ తిరిగి మరీ విక్రయిస్తున్నారు.

పోషకాలు పుష్కలం

కొబ్బరి బొండాలతో పాటు తాటి ముంజెలు కూడా మన శరీరంలో వేసవి తీవ్రత కారణంగా పోతున్న అనేక రకాల పోషకాలను తిరిగి అందిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. వంద గ్రాముల తాటి ముంజులో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాముల కొవ్వు, 61 మి.గ్రా. ఆమ్లం, 12 మి.గ్రా. కాల్షియం, 21 మి.గ్రా. పాస్పరస్, 0.3 మి.గ్రా ఇనుప ధాతువు ఉంటాయి. అలాగే జీర్ణ శక్తిని వృద్ధి చేసి, మలబద్ధకాన్ని నివారించే విటమిన్ ఏ 10 శాతం, విటమిన్ సీ 20 శాతం, కలక్యూమ్ 8 శాతం, ఐరన్ 6 శాతం ఉంటాయి. వేసవి తాపాన్ని తీర్చేందుకు, శరీరంలో శక్తిని నింపేందుకు తాటి ముంజెలు ఉపయోగపడతాయి. వీటిని తినడం వల్ల వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన క్యాలరీలు కూడా లభిస్తాయి. వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తారు. దానివల్ల ముఖంలో అలసట పోతుందని, మృదువుగా మారుతుందని చెబుతారు.

> **చాకిరీ ఎక్కువ, రాబడి తక్కువ**
>
> తాటి చెట్లు ఎక్కి కాయలను కోయడం ఒక ఎత్తు అయితే, వాటిని తీసుకువెళ్లి రోడ్ల పక్కన పెట్టి అమ్మడం మరొక ఎత్తు. తాటి కాయలను పదునైన కత్తితో నైస్‌గా చెక్కి ముంజెలను జాగ్రత్తగా బయటకు తీయాలి. ఆ విధంగా తీసిన వాటిని 12 (డజను) చొప్పున కవర్లలో వేసి అమ్ముతున్నాం. ఈ క్రమంలో చాకిరీ ఎక్కువగానే ఉంటుంది. రాబడి మాత్రం అంతంత మాత్రమే. రోజుకు రూ. 500పైబడి ఆదాయం వస్తుంది.
>
> – ఊతాడ ఏసు, కోలమూరు

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


బాలవరంలో శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రంగంపేట: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.చిన్నారావు సూచించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బాలవరం సచివాలయం వద్ద శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారులు జి.శ్రీనివాస్, ఎం.అప్పారావు, కంటి వైద్య నిపుణులు ఇందిర హాజరై 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు, ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఓ పి.ప్రసాద్, పీహెచ్ఎన్ ఎల్.గంగాభవాని, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెబ్ సిబ్బంది విస్తృత దాడులు


స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ డ్రమ్ములతో సెబ్ నార్త్ స్టేషన్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వెంకటనగరం పరిధిలోని లంకల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిబ్బంది శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. తూర్పులంక పోశమ్మగుడి వెనుక పొదలలో దాచిన 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నడిమిలంకలో 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసి నిందితులు కోసం విచారణ చేపడతున్నామని సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎన్ నిక్సన్ తెలిపారు. ఈ దాడులలో నార్త్ స్టేషన్, స్పెషల్ యూనిట్ మంగళగిరి సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటి నుంచి వాలీబాల్ శిక్షణ

ప్రకాశం నగర్: రాజమండ్రి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ బుధవారం నుంచి స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ ఫ్లడ్ లైట్ వాలీబాల్ కోర్టులో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ కార్యదర్శి కె.యశ్వంత్ శనివారం ప్రకటనలో తెలిపారు. పదేళ్లు పైబడిన బాలురు, బాలికలు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి కలవారు బుధవారం ఉదయం ఆరు గంటలకు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు.

ఏపీటీఎఫ్ నగర కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు: స్థానిక నెహ్రూ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏపీటీఎఫ్ రాజమండ్రి నగర శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రస్తుత నగర శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్ దీనికి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ వార్షిక నివేదికను సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికలో ఏపీటీఎఫ్ నగర శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎస్.గౌరీ శంకర్, అధ్యక్షుడిగా బి.తాతారావు, గౌరవాధ్యక్షుడిగా ఎం.సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కేవీవీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లుగా పి.వరలక్ష్మి, పి.బాపిరాజు, అడిషనల్ సెక్రటరీగా జీఎస్ఎస్ శ్రీనివాస్, సెక్రటరీలుగా బి.ఉషాకాంత, ముంగండి పద్మజ, జి.నాగేంద్ర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉద్యోగులకు రోటరీ క్లబ్ అవార్డులు


రైల్వే టీటీఐ కిరణ్ కుమార్‌ను సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సేవాదృక్పథంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సిటీ రాజమండ్రి తరఫున సత్కరిస్తున్నామని రోటరీ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్ సీఎస్ వెంకటరావు తెలిపారు. నగరంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో శనివారం వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందించారు. జేఎన్ రోడ్డులోని ఆంధ్రకేసరి సెంటినరీ రోటరీ రివర్ సిటీ హాల్‌లో సుమారు 28 మందిని సన్మానించారు. వారిలో రైల్వే, ఆర్టీసీ, వైద్యం, పోలీస్, విద్య, తపాలా, క్రీడాకారులు, పారిశుద్ధ్య కార్మికులు, యోగా టీచర్లు, విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కె.కాశీ విశ్వేశ్వరరావు, సుంకర నాగేంద్ర కిశోర్, కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు, రోటరీ అధ్యక్షుడు వీవీఎస్ కృష్ణారావు, రైల్వే సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

